క్లుప్తంగా

డీజీపీని కలిసిన ఎంపీ ఆదాల



నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం నెల్లూరుకు విచ్చేసిన సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్థానిక పోలీసు అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఎంపీ వెంట విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయులపై భావితరాల భవిష్యత్తు



ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నెల్లూరు(టౌన్): భావితరాల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు ఎంతో గౌరవం, గుర్తింపు ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాలరావు మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమం, పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవీంద్రబాబు, అధ్యాపకులు చంద్రమౌళి, లీలాకుమార్, గాయత్రి, మారుతీశేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరంలోని నిరాశ్రయులైన పేదలకు గురువారం కమిషనర్ వికాస్‌మర్మత్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గత నెలలో నగరవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్) కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల ద్వారా సేకరించిన దుస్తులను, వివిధ వస్తువులను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి పాతమున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో తాత్కాలికంగా ఆశ్రయం పొందుతున్న వారు, ఇళ్లు లేని వారు, యాచకులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌డీపీడీ స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగాధికారులు పాల్గొన్నారు.

పనులను రద్దు చేయడం దారుణం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ గత కౌన్సిల్ సమావేశంలో అనుమతులు పొందిన అభివృద్ధి పనులలో కొన్నింటిని కలెక్టర్ రద్దు చేయడం దారుణమని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. అన్ని అనుమతులు పొందిన పనులను అర్ధంతరంగా రద్దు చేయడం శోచనీయమన్నారు.

రేపు అల్లూరి సీతారామరాజు జయంతి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరం ప్రాంగణం వర్ధమాన సమాజం హాల్‌లో శనివారం మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు శాంతికల్చరల్స్, శ్రీకళానికేతన్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల నిర్వాహకులు పి.అమానుల్లాఖాన్, ఆర్.వంశీకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి పాటల పోటీలు, సీనియర్ గాయకుల సంగీత విభావరి, కోలాట ప్రదర్శనలు పేరూరి ప్రదీప్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రముఖులతో బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

టీకాలపై అవగాహన

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో పశుసందర్ధకశాఖ ఆధ్వర్యంలో మూగజీవాలకు వేస్తున్న వివిధ రకాల టీకాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మహేశ్వరుడు తెలిపారు. నెల్లూరు డివిజన్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రధానంగా నేషనల్ ఇన్వెస్టర్ మిషన్ స్కీముపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు సోమయ్య, చైతన్య కిషోర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రొట్టెల పండగకు పటిష్ట ఏర్పాట్లు

- రూ.3 కోట్లతో భక్తులకు సౌకర్యాలు
- అన్నిశాఖల సమన్వయంతో ముమ్మర ఏర్పాట్లు
- పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం
- గతేడాది కన్నా మెరుగైన వసతుల కల్పనకు చర్యలు



విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న బారాషహీద్ దర్గా

నెల్లూరు(బారకాసు): నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రొట్టెల పండగ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 90 శాతం ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారానికి వందశాతం ఏర్పాట్లు పూర్తి చేయనున్నారు. ఈ నెల 29 నుంచి 5 రోజులపాటు నిర్వహించే రొట్టెల పండగకు వచ్చే భక్తులకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు సమన్వయం చేసుకుని ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డితోపాటు కార్పొరేటర్లు, పార్టీ నేతలు రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎంపీ స్వయంగా దర్గాను సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగే కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ దర్గా వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

రూ.3 కోట్లతో..

రొట్టెల పండగ ఏర్పాట్ల కోసం నగరపాలక సంస్థ రూ.3 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ పండగకు రాష్ట్రంలోని జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా భక్తులు వచ్చే అవకాశం ఉంది. గతేడాది కన్నా ఈ ఏడాది భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో 12 తాగునీటి స్టాల్స్ ఏర్పాటు చేశారు. మహిళలకు 32, పురుషులకు 20 స్నానపు గదులు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక సదుపాయం, మరుగుదొడ్లు, వర్షం వస్తే తడవకుండా ప్రాంగణంలో షెడ్లపైన జింక్‌షీట్‌లు ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం ప్రత్యేకంగా ఓ విభాగాన్ని, పోలీస్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. దర్గా ప్రాంగణంలో అధికారులు కేటాయించిన స్థలాల్లో ఇప్పటికే వందలాది దుకాణాలు ఏర్పాటయ్యాయి.

పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు 26 పార్కింగ్ స్థలాలను కేటాయించారు. ఆయా పార్కింగ్ స్థలాల్లో కార్పొరేషన్ అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా మగవారికి, ఆడవారికి వేర్వేరుగా మొబైల్ టాయిలెట్స్, స్నానపు గదులు, షవర్‌బాత్స్, బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, తాగునీటి వసతి ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా ఆయా పార్కింగ్ స్థలాల్లో విద్యుద్దీపాలు, సీసీ కెమెరాలు అమర్చారు. వాటిని పోలీస్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేశారు.

పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు

బారాషహీద్ దర్గా ప్రాంగణంతోపాటు సమీప ప్రాంతాల్లో పారిశుద్ధ్యానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 28వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా కార్మికులను నియమించారు. మొత్తం ఏడు జోన్లుగా విభజించి ఆయా జోన్లలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు, రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టులలో సంబంధిత సిబ్బంది పనిచేసేలా ప్రణాళికలు రూపొందించారు. పారిశుద్ధ్యం నిర్వహణకు 4,908 మంది సిబ్బందిని నియమించారు. వెంటర్నరీ డాక్టర్, మహిళా వైద్యాధికారిణి, నలుగురు సూపర్‌వైజర్లు, 21 మంది ఇన్‌స్పెక్టర్లు, 21 మంది సచివాలయ కార్యదర్శులను నియమించారు. ఒక్కొక్క జోన్ పరిధిలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శి, 40 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉంటారు. ఇలా 7 జోన్లలో 7 మంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, 280 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉంటారు. ఇలా మూడు షిఫ్టులకు కలిపి 21 మంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, 21 మంది కార్యదర్శులు, 840 మంది పారిశుద్ధ్య కార్మికులు రొట్టెల పండగ ముగిసే వరకు 24 గంటలు పనిచేసేలా ప్రణాళికలు రూపొందించారు. దర్గా ప్రాంగణంలో మొత్తం 850 డస్ట్‌బిన్‌లను, పెద్ద డస్ట్‌బిన్‌లు 13 ఏర్పాటు చేశారు. అలాగే చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు 14 టాటాఏస్, 6 ట్రాక్టర్లు, 4 కాంపాక్టర్స్ వాహనాలను కేటాయించారు. స్వర్ణాలచెరువు ఘాట్ వద్ద మోటార్లతో వాటర్ ప్యూర్‌ఫై చేసే పనులు చేపట్టేందుకు అన్నివిధాలా సిద్ధం చేశారు. స్వర్ణాల చెరువులో భక్తులు రొట్టెలు మార్చుకునేందుకు, చెరువులో మునిగేందుకు, ఎక్కువ లోతులోకి వెళ్లకుండా ఉండేందుకు రెండంచెలుగా భారీకేడ్లు ఏర్పాటు చేశారు.

విద్యుత్ సౌకర్యం

బారాషహీద్ దర్గా ప్రాంగణంతోపాటు కేవీఆర్ పెట్రోల్ బంక్, బట్వాడిపాళెం సెంటర్, పాదలకూరురోడ్డు కూడలి వరకు విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. అలాగే వీఐపీ రిసెప్షన్ కోసం ప్రత్యేకంగా టెంట్, అన్నదానం కోసం మరో రెండు టెంట్లు ఏర్పాటు చేశారు. దర్గా ప్రాంగణంలో 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పోలీస్ కంట్రోల్ విభాగానికి అనుసంధానం చేశారు.



స్వర్ణాల చెరువు ప్రాంతంలో సందడి చేస్తున్న జన సందోహం



రొట్టె అందుకుంటున్న భకులు



దర్గాను దర్శించుకుంటున్న భక్తులు



దర్గా దర్శనానికి భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూ లైన్లు

న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు(బృందావనం): పుట్టుకతోనే బాలలు కొన్ని ప్రాథమిక హక్కులను పొందడమే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం, దేశం పట్ల కొన్ని విధులు, బాధ్యతలను కలిగి ఉంటారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కె.వాణి తెలిపారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల వద్ద ఉన్న విశ్వభారతి అంధుల పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కలిగించారు. అనంతరం భోజనం, వసతి, వైద్యసదుపాయాలు, ఆరోగ్య పరిస్థితులు తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.ప్రభావతమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతారెడ్డిపాళెంలో జగనన్న సురక్ష



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని చింతారెడ్డిపాళెం గ్రామంలో గురువారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు.

రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నాయని, నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి ద్వారా ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, నెల్లూరు తహసీల్దార్ నిర్మలనందబాబా, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీపీ బీవీ రమణారెడ్డి, నీళ్ల సునీల్‌యాదవ్, సురేంద్రరెడ్డి, మురళి, రాఘవేంద్రరావు, భారతి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలపాళెంలో..

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 19వ డివిజన్ రామలింగాపురం ముత్యాలపాళెంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జన జాతరలా సాగింది. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, అశోక్‌కుమార్, అవినాష్, నూనె మల్లికార్జున్‌యాదవ్, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్, సత్తార్, నాయకులు స్వర్ణ వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హరిబాబుయాదవ్, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, పచ్చా రవి, బులయ్య, కొండేటి శివప్రసాద్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొగాకుతో అనారోగ్య సమస్యలు



ఏసీనగర్ ప్రాంతంలోని షాపులో తనిఖీలు చేస్తున్న దృశ్యం

నెల్లూరు(బారకాసు): పొగాకు వినియోగంతో ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యాధికారిణి ఎస్‌కే సమీరా తెలిపారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లావైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని ఎన్‌సీడీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఏసీనగర్ ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సమీరా మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని, విద్యాసంస్థల ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నిషేధమని, కాదని విక్రయిస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీసీపీ సోషల్‌వర్కర్ హాసిని, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఎస్సైలు శ్రీహరిరెడ్డి, కోటేశ్వరరావు, యూహెచ్‌సీ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, సురేఖ, ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు



ఆటో, క్యాబ్ యూనియన్ల నాయకులకు సూచనలిస్తున్న ఆర్టీఓ చందన

నెల్లూరు(టౌన్): రొట్టెల పండగ సందర్భంగా ప్రైవేట్ ట్రావెల్స్, ఆటోలు తదితర వాహనాల యజమానులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాంతీయ రవాణా శాఖాధికారి చందన తెలిపారు. గురువారం నగరంలోని జిల్లా రవాణా కార్యాలయంలో ఆటో యూనియన్, టాటా మ్యాజిక్ వాహనాల యూనియన్ నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి నెల్లూరు బస్టాండ్, రైల్వే స్టేషన్లకు వచ్చే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయరాదన్నారు. వాహన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, మద్యం తాగి వాహనాలున్ని నడపడం, మితిమీరిన వేగంతో వెళ్లడం లాంటివి చేయకూడదని తెలిపారు. ఈ నిబంధనలను అతిక్రమంచిన వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంవీఐలు, ఏఎంవీఐలను ఆమె ఆదేశించారు. సమావేశంలో ఎంవీఐలు మురళీమోహన్, బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దర్గాకు వచ్చే భక్తులను అసౌకర్యం కలుగకుండా తీసుకెళ్లాలని ఎంవీఐ పవన్‌కార్తీక్ తెలిపారు. వాహన ఫిట్‌నెస్ ప్రాంగణంలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు.

నేడు కమిషనర్ సందర్శన వేళలు రద్దు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌ను కలుసుకునేందుకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3.45 నుంచి 4.30 గంటల వరకు విలేకరులు, 4.30 నుంచి 6 గంటలకు వరకు సాధారణ ప్రజల కోసం నిర్దేశించిన సందర్శన వేళలను ఈ నెల 28న రద్దు చేస్తున్నట్లు కమిషనర్ వికాస్‌మర్మత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రొట్టెల పండగ ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా సందర్శన వేళలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్‌టీసీ బస్టాండ్ డీఎం–1 పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం–1 మురళీకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ వార్షికోత్సవం



నెల్లూరు సిటీ: కేంద్రీయ విద్యాలయాల్లో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ దొరసానమ్మ తెలిపారు. నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యం పెంచేందుకు వివిధ ప్రయోగాత్మక కార్యక్రమాలు చేపట్టామన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, స్కిల్ ఓరియంటల్ ప్రోగ్రామ్స్, నిపుణ భారత్ మిషన్ విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం అందజేస్తుందన్నారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున జీవీ రామ్‌కుమార్, సెక్రటరీ డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినర్ ఎస్పీఎస్ఆర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రణీత, జోషిబాబు, రవికుమార్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): వర్షాకాలంలో కీటక జనిత వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లావైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో జిల్లా లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని జూమ్ ద్వారా నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారిణి హుసేనమ్మ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో డెంగీ ప్రబలే అవకాశం ఉందన్నారు. జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. నీటి నిల్వల్లో వదిలేందుకు లక్ష గంబూషియా చేపలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా మత్స్యశాఖ జేడీ తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం

- నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్



డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఒక్కో డివిజన్‌లో కోటి రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల పనులను పెండింగ్ లేకుండా అన్నీ పూర్తి చేస్తామని నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. నెల్లూరు నగరంలోని 8వ డివిజన్ ఉస్మాన్‌సాహెబ్‌పేట శివాలయంవీధి, తడికల బజారుసెంటర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఒక్కో సచివాలయానికి సంబంధించి రూ.40 లక్షలతో పనులు చేపడతామని తెలిపారు. పారిశుద్ధ్య పనులు, వీధిలైట్ల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ నాలుగేళ్లలో ఎవరు ప్రజల్లో తిరిగారో అందరూ గమనిస్తున్నారని, 2024 ఎన్నికల్లో ఎవరికి ఓట్లు వేయాలో వారికి తెలుసునని, కేవలం ఎన్నికల సమయంలో కనిపించే వారికి తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొగళ్లపల్లి కామాక్షిదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించండి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండగకు వచ్చే యాత్రికులు అక్కడి నుంచి ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా సందర్శనకు వస్తారని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. భక్తుల ఏర్పాట్లకు సంబంధించి గురువారం నెల్లూరులోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో దర్గా ఈఓ హుస్సేన్, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ఏఎస్‌పేట దర్గా సందర్శనకు వస్తారని, దర్గా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరుగుదొడ్లు, నిరంతరం విద్యుత్ సౌకర్యం, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ పర్యవేక్షణపై అధికారుల దృష్టి సారించాలని తెలిపారు. ఆర్టీసీ అధికారులు ఎక్కువ బస్సులు నడిపే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిలానీ, హరికృష్ణారెడ్డి, షకీల్, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా భూముల రీసర్వే

- జేసీ రోణంకి కూర్మనాథ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో 105 గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియ సమగ్రంగా, పటిష్టంగా పూర్తయిందని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. గురువారం విజయవాడ నుంచి ఏపీ ల్యాండ్ సర్వే కమిషనర్ సిద్ధార్థ్‌జైన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 64 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ జరుగుతోందని, ఆగస్టు 30 నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. 56 వేల హద్దురాళ్లు వేయాల్సి ఉండగా 8 వేలు పూర్తి చేశామని, మిగిలిన హద్దురాళ్లను వేసే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. రీసర్వేకు సంబంధించి కమిషనర్ జేసీకి పలు సూచనలు, సలహాలు అందించారు.